క్లుప్తంగా

రైతులకు తప్పని యూరియా కష్టాలు



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): రైతులకు యూరియా కష్టాలు తప్పటం లేదు. యూరియా కోసం శుక్రవారం రైతులు సొసైటీ వద్దకు పరుగులు పెట్టారు. ప్రస్తుతం వరి పంటకు యూరియా ఎంతో అవసరం. అయితే యూరియా కొందరికి ఎంత కావాలన్నా దొరుకుతోందని, కొందరికి అసలు అందటం లేదని పలువురు రైతులు సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సొసైటీ గోడౌన్ ఉండగా వేరే ఆర్బీకే సెంటర్ వద్ద పెట్టి యూరియా కట్టలు ఇవ్వటం ఏమిటని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు చేత పట్టుకుని పడిగాపులు పడుతున్నామని, అన్ని పనులు వదిలేసి యూరియా కోసం నిలబడితే ఒకటి లేదా రెండు బస్తాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



కంచికచర్ల: ఎంపీడీవోగా డి.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మమిడిముక్కల మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన బీఎం.విజయలక్ష్మి నందిగామ డ్వామా ఏపీడీగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ వెంకటేశ్వరరావును సిబ్బంది సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యానికి మేలు



నందిగామ రూరల్: పోషకాహారం తీసుకోవటం ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది అని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మండలంలోని కంచల గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్బోహైడ్రేట్‌లు, విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ మిశ్రమాలతో కూడిన సంపూర్ణ ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. మనం రోజువారీ తీసుకునే ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్‌లు, మొలకెత్తిన గింజలు, పాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రోటీన్ ఫుడ్‌పై శ్రద్ధ చూపాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు వెంకట్రావమ్మ, కరుణకుమారి, తారాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవును రక్షించిన పంచాయతీ కార్మికులు

కంచికచర్ల: పట్టణంలోని జుజ్జూరు రోడ్ వాటర్ ట్యాంకుల వద్ద ప్రమాదవశాత్తు ఓ గోవు ఆరడుగుల డ్రైనేజీలో శుక్రవారం పడిపోయింది. డ్రెయిన్‌లో నుంచి బయటికి రాలేక అల్లాడుతున్న గోవును గమనించిన స్థానికులు గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల సునీతకు విషయం తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆమె పంచాయతీ సిబ్బందిని పురమాయించారు. పంచాయతీ శానిటరీ మేస్త్రి బెజ్జం భూషణం పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో తాళ్లు కట్టి దానిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరాకట్టలేరు

వీరులపాడు: ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా మండలంలోని పల్లంపల్లి వద్దనున్న వైరాకట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీటితో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వైరాకట్టలేరును శుక్రవారం తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో వీరులపాడు- నందిగామ మండలాల మధ్య రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు. రాకపోకలు సాగించకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై నిరసన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంపు విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎంసీపీఐ, ఏఐసీటీయూ, యువైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొండపల్లి ఎంసీపీఐ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ఉన్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచడంతో పాటు మరో మూడు గంటలు పని పెంచుకునే విధానం కార్మిక శాఖకు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ, కాసాని గణేష్ బాబు, ఎంసీపీఐ మండల కన్వీనర్ కలకోటి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



మునగచర్లలో రూ.32 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ



మహాలక్ష్మీదేవి అలంకారంలో అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



మహాలక్ష్మీదేవిగా లింగాలపాడు లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారు



పెనుగంచిప్రోలు తూర్పు బజార్‌లో శ్రీమహాలక్ష్మీదేవిగా



అనిగండ్లపాడు బోస్ సెంటర్‌లో శ్రీమహాలక్ష్మీ దేవిగా..



పేట స్టీల్ ప్లాంట్ మైన్స్ వద్ద నాగసత్యమ్మ ఆలయంలో..

శ్రీమహాలక్ష్మీ.. నమోస్తుతే!

వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

నందిగామ రూరల్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో శోభాయమానంగా కొనసాగుతున్నాయి. నందిగామ పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాలలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలకు శుక్రవారం ప్రత్యేక అలంకరణలతో పాటు విశేష పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని అంబారుపేట సత్యమ్మ అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. ఈవో సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారు, గోళ్లమూడి గ్రామంలో శంభులింగేశ్వర స్వామి వారి ఆలయంలోని పార్వతీ అమ్మవారు, పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో కనకదుర్గ, కనక మహాలక్ష్మీ, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లు, చందాపురం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయ ఆవరణలో దుర్గామాత, మునగచర్ల గ్రామంలోని దుర్గమ్మ అమ్మారు శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మునగచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను రూ.32 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

నందిగామ టౌన్: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్యామలాంబ అమ్మవారు, వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మమాలక్ష్మీ అమ్మవారిని శ్రీమహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లోని సాయి అయ్యప్ప ఆలయంలోని మాలికాపురత్తమ్మ అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నెహ్రూ నగర్ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని పద్మావతి అమ్మవారు, కనకదుర్గ నగర్‌లోని దుర్గామాత, రెవెన్యూ కాలనీలోని అంకమ్మ, భద్రకాళి అమ్మవార్లను శ్రీమహాలక్ష్మీ దేవిగా అలంకరించారు.

పెనుగంచిప్రోలు: ఐదవ రోజు శుక్రవారం తూర్పు బజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, డౌన్ సెంటర్, పాత సినిహాల్ సెంటర్, అనిగండ్లపాడు బోస్ పేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు కరెన్సీ నోట్ల అలంకరణలో శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పల్లగిరి త్రిశక్తి పీఠంలో సామూహిక కుంకుమార్చనలు



పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో శ్రీమహాలక్ష్మీ దేవి అలంకరణ

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని పలు ఆలయాలలో శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో తులాభారం నిర్వహించారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం శ్రీకాత్యాయనీదేవి అలంకరణలో, అద్దాలబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీమహాచండీదేవి అలంకరణలో, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీలలితత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం (పెద్ద శివాలయం), మార్కండేయబజారులో, ఆనందసాయి ఆలయంలో, తోటబజారులో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిచ్చారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ సమీపంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ మైన్స్ క్వార్టర్స్ వద్ద శ్రీనాగసత్యమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శ్రీధనలక్ష్మిగా అలంకరించారు. జగ్గయ్యపేట లైమ్ స్టోన్ మైన్స్ ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఎస్పీ జేఎల్ఎం పూర్వ ఉద్యోగులు వి.ఆంజనేయులు, డీవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు శుక్రవారం మహాలక్ష్మీదేవి అలంకారం చేశారు. తిరుమలగిరి శివాలయంలోని అమ్మవారి విగ్రహాన్ని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి మహాలక్ష్మీదేవి అలంకరణ చేశారు.

వత్సవాయి: మండలంలో శుక్రవారం అమ్మవారు భక్తులకు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, లింగాల, చిట్టేల, మక్కపేట, భీమవరం, మంగొల్లు తదితర గ్రామాలలో అమ్మవారి విగ్రహాలను కరెన్సీ నోట్లతో అలంకరించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి అలంకరించిన చీరలను సాయంత్రం సమయాల్లో వేలం నిర్వహిస్తున్నారు.

దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

-మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

కంచికచర్ల: కనకదుర్గమ్మ చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని వసంత కాలనీలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు ఏర్పాటు చేసిన దేవీశరన్నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మిగా ప్రజల కష్టసుఖాల్లో అమ్మవారి ఆశీర్వాదం ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవా కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. రెండు వేల మందికి అన్నదానం చేశారు. నాయకులు కాల్వ పెదబాబు, అమర్లపూడి యోహాన్, దేవర కొండ గురవయ్య, ఎం.పాండురంగారావు, వేమా రోజా రమణి, గోగినేని వెంకటేశ్వరరావు, ఎర్రంశెట్టి బాలయ్య, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మీ దేవిగా వాసవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



కంచికచర్లలో మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావును సత్కరిస్తున్న వేమా

రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

పరిటాల(కంచికచర్ల): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని గని ఆత్కూర్‌లో రోడ్డులో అమ్మవారిని రూ.5 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. దుర్గామల్లేశ్వస్వామి కమిటీ ఆధ్వర్యంలో దసరా వేడుకలను నిర్వహిస్తున్నారు. రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సందడిగా బతుకమ్మ వేడుకలు..

నందిగామ రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాలలో బతుకమ్మల వేడుకలను శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని కంచల, గోళ్లమూడి, నందిగామ, చందాపురం, అడవిరావులపాడు, ఐతవరం, అంబారుపేట, లింగాలపాడు, తదితర గ్రామాలలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో బతుకమ్మలాడుతున్నారు. ఆట పాటలతో బతుకమ్మలాడిన అనంతరం ఆయా గ్రామాల సమీపంలోని చెరువులు, వాగులు, నదులలో నిమజ్జనం చేసేందుకు సాగనంపారు.



బతుకమ్మను నిమజ్జనానికి సాగనంపుతున్న మహిళలు, యువతులు

ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం రాత్రి స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో వైభవంగా జరిగాయి. బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. గేయాలు ఆలపిస్తూ నృత్యాలు, కోలాటాలతో అలరించారు. కమిటీ ప్రతినిధులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

వీరులపాడు: మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలోని అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఎంపీపీ కోటేరు లక్ష్మీ కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తుల సహకారంతో రూ.30 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారి మండపాన్ని అలంకరించారు. కరెన్సీ నోట్ల అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గామాతను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రికి అమ్మవారి మండపం వద్ద మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలాడారు. పూజల అనంతరం బతుకమ్మలను గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతి, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పేటలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు, కమిటీ సభ్యులు



మక్కపేట ఆంజనేయస్వామి ఆలయంలో కరెన్సీ నోట్లతో అమ్మవారు



పెద్దాపురంలో రూ.30 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ



ముక్త్యాలలో మహాలక్ష్మీ అలంకరణలో దుర్గామాత



తిరుమలగిరి కరెన్సీ నోట్ల అలంకారంలో దుర్గాదేవి



పరిటాలలో కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు



పేటలోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో..



పేటలోని మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో..

ఎర్ర కాలువపై కల్వర్టు నిర్మించరూ!

షేర్‌మహ్మదపేట(జగ్గయ్యపేట): గ్రామంలోని రామచంద్రునిపేటకు వెళ్లే రహదారిలో ఎర్రకాల్వ కట్టపై కల్వర్టు లేకపోవటంతో ఆ ప్రాంతంలోని కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావటంతో కొద్దిపాటి వర్షం వచ్చినా కాల్వకు వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఆ ప్రాంతంలోని 40 కుటుంబాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం నాలుగు తూములతో రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ అవి పూడిపోవడంతో వరద సమయంలో నాలుగైదు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతూ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.



తూములు పూడిపోవటంతో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

బాలకృష్ణ వ్యాఖ్యలు సిగ్గుచేటు



ఎంపీపీ మలక్ బషీర్

కంచికచర్ల: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజానికి సిగ్గుచేటని ఎంపీపీ మలక్‌బషీర్ మండిపడ్డారు. ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం బాలకృష్ణ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కోట్లాది మంది పేదలకు మంచి చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలతో వారి కుటుంబంపై మాకు ఉన్న గౌరవం పోయిందని తెలిపారు. నీతండ్రి ఎన్టీఆర్‌తో జిల్లా ఏర్పాటు చేసిన దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంచి చేసిన వారిని తూలనాడటం బాలకృష్ణకు అలవాటుగా మారిందన్నారు. బెజవాడ సాక్షిగా మోదీ తల్లిని తిట్టి, మళ్లీ వాటేసుకున్న వ్యక్తి బాలకృష్ణ అని గుర్తు చేశారు. సభలో లేని, సంబంధంలేని చిరంజీవిని కూడా తూలనాడటం సిగ్గుచేటు అన్నారు. చిరంజీవిని తూలనాడినా కనీసం ఖండించలేని స్థితిలో జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారని ఎద్దేవా చేశారు. బాలకృష్ణ తక్షణమే జగన్‌మోహన్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా

తిరువూరు: రాష్ట్రంలో గత ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడానికి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం తిరువూరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బైపాస్‌రోడ్డులోని రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయం వరకు ప్రదర్శన అనంతరం ధర్నా చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, వెంటనే ప్రైవేటీకరణ ఆపాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చలమాల సత్యనారాయణ, తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, ప్రకాష్‌రెడ్డి, పాపారావు, ప్రసాద్, మురళీ కృష్ణారెడ్డి, వెలుగోటి ఆదినారాయణ, యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, నెహ్రూజీ, కాంగ్రెస్ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, ఉప్పలపాటి లక్ష్మీదాసు, బొడ్డు ప్రకాశరావు, కొత్తగుండ్ల గోపాలకృష్ణ, సీపీఎం నాయకులు ఎస్వీ భద్రం, బి. వెంకటేశ్వరరావు, పంతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పని చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఉక్కు కళావేదికలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈఎస్ఐ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మక్కపేట(వత్సవాయి): ట్రాన్స్‌పార్మర్ ప్రమాదకరంగా మారడంతో స్థానికులు భయపడుతున్నారు. గ్రామంలోని గోపినేనిపాలెం రహదారిలో బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలోని ట్రాన్స్‌పార్మర్ కింద ఎత్తులో ఉంది. దాని చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. చెత్తాచెదారంతో నిండిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు మొత్తం ట్రాన్స్‌పార్మర్ చుట్టూ నిలిచిపోయాయి. మురుగునీరు నిలబడి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి చెత్తను తొలగించి మురుగునీరు పోయే మార్గం చూడాలన్నారు. ట్రాన్స్‌పార్మర్ ఎత్తు పెంచి చట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరుతున్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

పరిటాల(కంచికచర్ల): స్థానిక ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, మెకానికల్ విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ శుక్రవారం నిర్వహించారు. మిత్సుబిషి, శ్రీసాయి కంపెనీల హెచ్ఆర్ మేనేజర్‌లు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొనగా 8 మంది ఈసీఈ, 9 మంది మెకానికల్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు తెలిపారు. ఎంపికైన వారికి ఆకర్షణీయమైన వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

మహిళలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

నందిగామ రూరల్: మహిళలు, బాలికలకు మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని వైద్యాధికారులు విజయకృష్ణ, వల్లీపద్మ పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కంచల, రామిరెడ్డిపల్లి గ్రామాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళల్లో బీపీ, షుగర్, నోటి, గర్భాశయ క్యాన్సర్, తదితర అనారోగ్య సమస్యలను గుర్తించి వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం పౌష్టికాహార ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాలు, కిశోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. వైద్యారోగ్య సిబ్బంది, గ్రామాల నాయకులు, అంగన్‌వాడీ, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ అవకాశాలు

ఇబ్రహీంపట్నం: అకడమిక్ విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జాకీర్ హుస్సేన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ అన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాకీర్ హుస్సేన్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి మోహన్‌బాబు మాట్లాడుతూ జాబ్ మేళాకు 139 మంది అభ్యర్థులు హాజరుకాగా 63 మందిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత కంపెనీలు ఆఫర్ లెటర్లు అందజేసి శిక్షణ ఇస్తాయని చెప్పారు. వివిధ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్‌లు పాల్గొన్నారు.